



"ద హెల్ విత్ యువర్ మనీ. గెటెవే! ఆడపిల బ్రతుకంటే అంత చులకనగావుందా మీకు!" నిప్పులుకురిపించింది రాజ్యలక్ష్మి.

* * *

జ్యోతి కళ్ళల్లో ఆనందజ్యోతులు వెలగడం లేదు. హృదయంలో తేనెధారలు కురవడం లేదు. శరీరం మధురమధురంగా ప్రకంపించడంలేదు. చెక్కిళ్ళలో సిగ్గుపువ్వులు పూయడంలేదు.

నిర్లిప్తంగా చీర మార్చుకుని, బారెడు జడను విప్పి అల్లుకునే ఆసక్తిలేక పైపైన దువ్వుకుని, బొట్టు సవరించుకుని వచ్చి కూర్చుంది జ్యోతి. పేరు, చదువు, వంటా వార్పు, కుట్లు, అల్లికలు, సంగీతం—యిత్యాది విషయాలగురించి యిష్టంవచ్చిన ప్రశ్నలన్నీ అడుగుతూంటే నిర్వికారంగా, యాంత్రికంగా జవాబుచెప్తూంది జ్యోతి.

ప్రశ్నల ప్రహసనం ముగిసి బేరాలఘట్టంలోకి వచ్చాక జ్యోతికి విముక్తికలిగి లోపలికి వెళ్ళింది. పెళ్ళికొడుకు తల్లిదండ్రులు, మేనమామ, అక్క ద్విగుణీకృతోత్సాహంతో తమ కోరికల్ని వెల్లడిస్తున్నారు. నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా తమకు జరగవలసిన పెట్టుపోతలగురించి చెప్తున్నారు.

జ్యోతి తండ్రి సుబ్బారావు బసవన్నలా తలూపుతున్నాడు కొన్నిటికి తను భరాయించలేనని ప్రాధేయపడుతున్నాడు వాళ్ళగొంతెమ్మ కోర్కెలు వింటూ అసలీసంబంధానికి తను తూగగలడా అని బెంబేలు పడుతున్నాడు. అంతలోనే తెగింపుతో తనకు తలకుమించిన వాటినికూడా ఒప్పుకుంటున్నాడు. తల తాకట్టు పెట్టయినాసరే యీ సంబంధాన్ని ఖాయపరచాలని దృఢంగా నిశ్చయించుకుంటున్నాడు. యీపాటి గుణవంతుడు, సిరంగా నాలుగు రాళ్ళు తెచ్చుకునేవాడు అల్లుడవడం గొప్పేనను కుంటున్నాడు.

జ్యోతి తల్లి సావిత్రికూడా యథాశక్తి భర్తకు సాయం చేస్తూంది. పెళ్ళికొడుకు తల్లికీ, అక్కకు అతివినయంగా తనకూతురి ఓర్పుని, మంచిబుద్ధిని, వనితనాన్ని వర్ణించి చెప్తూంది.

"మా అమ్మాయని చెప్పుకోవడంకాదుగాని మాజ్యోతి యీ కాలం పిలల్లాంటిది కాదొదిన గారూ! పెద్దలంటే వినయం, ఒద్దికవున్నపిల్ల. యిది కావాలని పేచీగాని, యిదిలేదని గునవడంగానీలేవు మీరు పెద్దమనసుచేసి, దాన్ని మీ కడుపులో పెట్టుకున్నారంటే మా కన్న అదృష్టవంతులెవరూ వుండరు"


జ్యోతి అన్నీ గమనిస్తూనే వుంది. తల్లిదండ్రుల్ని చూస్తూంటే జాలిగా వుందామెకు. తమనుతాము చంపుకుని దేవురిస్తూంటే వాళ్ళంత చిద్విలాసంగా వరాలిచ్చే దేవుడిపోజులివ్వడం చూచి మండిపోతూంది.

'బావగారూ! యింక నావల్లకాదు అన్నా, నా భార్యను. పిల్లను అమ్ముకుంటే తప్ప మీరు చెప్పేవన్నీ జరపలేను." చివరకు విసిగిపోయి చేతులెత్తేశాడు సుబ్బారావు.

వున్న కాస్తాకూస్తా ఆస్తి మగపిల్లల చదువులకు, మిగతా ఆడపిల్లల పెళ్ళిళ్ళకు హరించుకుపోయింది. ఆఖరుపిల్ల దీన్ని కాస్త యోగ్యుడి చేతిలో పెట్టి నిశ్చింతగా ఊపిరితీసుకుందామంటే అది నెరవేరేలాలేదు. వాళ్ళడిగిన వాటికన్నిటికి ఒప్పుకుంటున్నా యింకా వాళ్ళకు సంతృప్తి కలగకపోవడం చూచి ఉక్రోషంగా సుబ్బారావుకి.

"యింత గతిలేని సంబంధానికి తీసుకొచ్చావేంటిరా రాముడూ!" పెళ్ళి కొడుకుతల్లి సంబంధం తీసుకొచ్చిన తమ్ముడ్ని నిష్ఠూరమాడుతూ ఝుంయిమని లేచింది.

**ఉన్న కాస్తాకూస్తా ఆస్థి మగపిల్లల చదువులకు, మిగతా ఆడపిల్లల పెళ్ళిళ్ళకు హరించుకుపోయింది ఆఖరుపిల్ల దీన్ని కాస్త యోగ్యుడి చేతిలో పెట్టి నిశ్చింతగా ఊపిరితీసుకుందామంటే అది నెరవేరేలాలేదు-వాళ్ళడిగినవాటికన్నా ఇంకావాళ్ళకు సంతృప్తికలగకపోవడం చూస్తుంటే!**



సావిత్రి ఆమెను బ్రతిమాలి, భర్త అన్న 'యింక నావల్లకాదు' అనే మాటకు క్షమాపణ చెప్పుకొని శాంతపరచింది. మళ్ళీ ఫ్రెష్‌గా కొత్త కోరికలు పుట్టుకొచ్చాయి పెళ్ళికొడుకు తల్లికి, అక్కకు. యింత జరుగుతున్నా చలనం లేకుండా ఉత్సవ విగ్రహంలా కూర్చున్న పెళ్ళికొడుకుని చూస్తే కంపరంగా వుంది జ్యోతికి.

నాలుగు గంటల సుదీర్ఘ చర్చలతర్వాత బేరాలు కుదిరాయి. మళ్ళీ యీ సంబంధం ఎక్కడ విడిపోతుందోనన్న భయంతో అప్పటికప్పుడు తాంబూలాలు పుచ్చుకోవడానికి సన్నాహంచేసి ఆకార్యక్రమంకూడా జరిపించి ఊపిరిపీల్చుకున్నాడు సుబ్బారావు

తండ్రి తాపత్రయంచూచి జ్యోతి దుఃఖ పడుతూంది. 'దేవుడా ! యీ దేశంలో ఎవరినీ ఆడపిల్లగా పుట్టించకు. పుట్టించినా మధ్య తరగతి యింట్లో పుట్టించకు. పుట్టించినా కడసారి ఆడపిల్లగా అసలే పుట్టించకు' అని మౌనంగా దేవుడిని వేడుకుంటూంది.

* * *

తోకచుక్కలా వూడిపడ్డాడు పెళ్ళికొడుకు మేనమామ రామారావు.

"పిల్ల మరీ అర్భనాకారంగా వుందని గుణుస్తున్నాడు మావాడు. పిల్ల ఆరోగ్యంలో ఏమైనా లోపముందో ఏమిటో ఒకసారి డాక్టరుకి చూపిస్తే మంచిదంటున్నాడు" అతగాడు చెప్పింది విని పిచ్చిచూపులు చూస్తున్నాడు సుబ్బారావు.

"యిదేం ప్రారబ్ధమండీ ! యీ అనుమానాలు, పరీక్షలు !! ఎవరికైనా తెలిస్తే ఎంత అప్రదిష్ట !" నెత్తీ నోరూ కొట్టుకుంది భర్త దగ్గర సావిత్రి.

"నెమ్మది. అతను వింటే బావుండదు. ఆడపిల్లవాళ్ళం వాళ్లు చెయ్యమన్నట్లు చెయ్యక తప్పుతుందా" భార్యను మందలించి కూతుర్ని వెంటబెట్టుకుని డాక్టరుదగ్గరకువెళ్ళాడు సుబ్బారావు.

డాక్టరు దగ్గరకువెళ్ళాక రామారావుప్రవర్తన మరీవింతగావుంది. సుబ్బారావుని, జ్యోతిని, తన భార్య సుధను బయటకూర్చోబెట్టి ముంద తను డాకర్ రూమ్‌లోకి వెళ్ళాడు.

"డాక్టర్ ! కొంచెం రహస్యంగా వుంచాలీ విషయాన్ని. మా మేనల్లుడికో సంబంధం ఖాయంచేసాము. ఆ అమ్మాయి మరీ బలహీనంగావుంది. మీకోమారు పరీక్షచేసి...." బలహీనంగా వున్నామెను పరీక్షచెయ్యడానికి రహస్యమేమిటో అర్థంకాలేదు డాక్టర్ రాజ్యలక్ష్మికి.

"అమ్మాయిని తీసుకురండి." మృదువుగా చెప్పిందామె. అతను బయటికివెళ్ళి జ్యోతిని, సుధను లోపలికి పంపాడు. ఆహారలోపంతో వచ్చిన బలహీనత, స్వతస్సిద్ధమైన పొడవు, సన్నంతప్ప తనకు మరేజబ్బూలేదని తెలిసిన జ్యోతి వాళ్ళఅజ్ఞానాన్ని, ఆహంకారాన్ని తిట్టుకుంటూ రాజ్యలక్ష్మి అడిగినదానికి సమాధానం చెప్తూంది.

"అమ్మాయికి జబ్బేమీ లేదమ్మా ! మామూలు బలహీనతే, మంచి ఆహారం టానిక్స్ యిస్తేచాలు." సుధ రామారావును పిలుచుకొచ్చింది

"మీరు బాగాపరీక్షచేసారా డాక్టర్ ?" అతను అడిగినతీరుకు దెబ్బతిన్నట్లు చూసింది రాజ్యలక్ష్మి.

"వాడు యు మీన్ ?" సాధ్యమైనంత మామూలుగా అడిగింది రాజ్యలక్ష్మి.

"మీరు బాగాచూసారా....?"

"స్టాపిట్. సరిగా చూడకుండా ఆమె కేజబ్బూలేదని ఎలా చెప్తాను ?" మధ్యలోనే అతన్నిఆపి కరుగ్గా ప్రశ్నించింది రాజ్యలక్ష్మి.

"సంసారజీవితానికి పనికొస్తుందంటారా ?" నిస్సిగ్గుగా, నింపాదిగా అడిగాడతను. నిర్ఘాంతపోయిచూస్తూంది జ్యోతి. తీక్షణంగా అతనివంకచూస్తున్న రాజ్యలక్ష్మికి అతని నాగరికమైన దుస్తులు సౌమ్యంగాకనిపిస్తున్న ముఖం వెనుక దాగివున్న మృగం కనిపిస్తూంది.

" 'వర్జిన్' అవునో, కాదో టెస్టుచేసారా ?" యింక అతన్ని భరించడం రాజ్యలక్ష్మివల్ల కావడంలేదు.

"అలాంటి టెస్టులన్నీ చెయ్యడం అమానుషం." అతికష్టంమీద ఆవేశాన్నినిగ్రహించుకుంటూ జవాబిచ్చింది రాజ్యలక్ష్మి. జ్యోతి గుప్పెళ్ళు బిగుసుకుంటున్నాయి.

"దాందేముంది ? మావాడు టెస్టుచేయించమని చెప్పాడు సంసారానికి పనికొస్తుందో రాదో. పిల్లలు పుడతారో పుటరో, అసలు 'వర్జిన్' అవునో, కాదో...." సిగ్గుతో, అవమానంతో జ్యోతి తలవంగిపోతూంది. కోపంతో వణికిపోతూంది రాజ్యలక్ష్మి. బలవంతాన తననుతాను అదుపులోపెటుకుంది.

"చూడండి. ఏఆడపిలకూ, ఆమెఆరోగ్యం దృష్ట్యా తప్పనిసరైతే తప్ప. పెళ్ళికాకముందు లోపలి పరీక్షచెయ్యకూడదు" అతనికి చెప్తూ గాడిదకు సైన్సుపాఠం చెప్తున్నట్టనుభూతి చెందింది రాజ్యలక్ష్మి.

"దాందేముందిలెండి, అలా రూలుంటే వుండొచ్చు. అన్నీ రూల్సుప్రకారమే చేస్తున్నామా ?" అతని ధోరణి సుధకుకూడా చిరాకుపుట్టిస్తూంది. అతన్నెలా వారించాలో తెలియక ముళ్ళమీదకూర్చున్నట్లు కూర్చుంది.

"న్యాయసూత్రం కాదయ్యా మహానుభావా! నీతిసూత్రం. నీతిసూత్రాలను పట్టుకునెవరు వేళ్ళాడుతున్నారంటావా ? ఎవరిసంగతో నాకు తెలియదుగాని నేను మాత్రం కొన్ని సూత్రాలకు కట్టుబడినదాన్ని." రాజ్యలక్ష్మి వంక 'యీవిడెక్కడో పిచ్చిమాలోకంలా వుంద' న్నట్లు చూస్తున్నాడతను.

"మీ మాటప్రకారం యీ అమాయకురాలు 'కన్య' అవునో, కాదో. పిల్లలు పుడతారో పుట్టరో నేను పరీక్షచేసి చెప్తాను. మీకే కట్నకానుకలదగ్గరో పేచీవచ్చి యీ పిల్లను సక్షేళ్లో



ప్రార్థన ?

"మీరు భోజనానికి ముందే దైవ ప్రార్థన చేస్తారా ?" అడిగాడు గిరి, హరిని

"చెయ్యం ; అదృష్టవశాత్తూ మా అమ్మ బాగా వంట చేస్తుందిలే" అన్నాడు హరి

—ఎ. ఎల్ నారాయణ (బొంబాయి)


నరముల బలహీనత, గుప్త రోగములకు
ఉత్తమ చికిత్స !
పెండ్లి ముందు, పెండ్లి తర్వాత
సంప్రదించండి :



Dr. Z. H. ROY
(Govt. Regd.)
ఆసియా క్లినిక్
ఆర్.టి.సి. క్రాస్‌రోడ్,
సంధ్య టాకీస్ ఎదుట,
హైద్రాబాద్-500020
కృష్ణాటాకీస్‌వద్ద, కడప-1
Dr. K. Kesava Rao (Govt. Regd)

మెడికల్, ఇంజనీరింగ్
ఎంట్రన్స్ పరీక్షల శిక్షణ
సీట్లు ముందుగా రిజర్వు చేసుకోవచ్చు !
హాస్టల్ వసతి కూడా కలదు.
ఏప్రియల్ చివరివరకు గడువు.
వివరాలకు వెంటనే కార్డు వ్రాయండి.
శాంతా కాలేజి
బ్రాడీపేట, గుంటూరు-2
పి. శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్.



ముం౯ పోతారు. మళ్ళీ మీలాంటి మహాను భావుదేవచ్చి మీలాగే కన్యాత్వపరీక్ష అంటే?! మీలాగే నాలాంటి మరో డాక్టరు దగ్గరికితీసుకు వెళ్తే, నాపరీక్షలో ఒకవేళ కన్నెపొర చిరిగి పోయి ఆ మరో డాక్టరు యీమె కన్యకాదని నిర్ధారిస్తే, యీపిల్ల బ్రతుకేంకావాలి?"

రాజ్యలక్ష్మికి రామారావు వంకచూస్తున్నా అతను కనిపించడంలేదు, గాడిదే కనిపిస్తూంది. రాజ్యలక్ష్మివంక కృతజ్ఞతగా చూచింది జ్యోతి.

"అలాగంటే ఎలా? మీరోసారి పరీక్ష మట్టుకు చెయ్యాలి."

"నేను మాత్రం అలాంటి పరీక్షలు చెయ్యను" నిష్కర్షగా చెప్పి 'యింక నీతో మాటలు అనవసర'మన్నట్లుగా లేచింది రాజ్యలక్ష్మి. అతని మాటలు వింటూంటే మధ్యతరగతి మనస్తత్వపు మరో వెట్టితలలా అనిపిస్తూందామెకు.

రాజ్యలక్ష్మి లేవడం చూచాక చటుక్కున అతనికో ఆలోచన వచ్చింది. మూడు పది రూపాయలనోట్లు తీసి ఆమె ముందుంచాడు.

"యిదుంచండి. మీరు డబ్బుకు చూడొద్దు. డబ్బెంతయినాసరే"

ఆడపులిలా ముందుకో అడుగు వేసింది రాజ్యలక్ష్మి

"ద హెల్ విత్ యువర్ మనీ...."

తల దించుకుని, చలనం లేనట్లు కూర్చున్న జ్యోతిని చూచి అమితమైన జాలిముంచు కొచ్చింది రాజ్యలక్ష్మికి. అతి దారుణంగా ఆమెను గాయపరచిన అతనిమీద కసిగావుంది.

"అమ్మా!" రాజ్యలక్ష్మి కేకలువిని ఆత్రతగా లోపలికి వచ్చాడు సుబ్బారావు, గాజు కళ్ళతో తండ్రివంక చూచింది జ్యోతి. బావురుమని ఏడుస్తుందేమో, ఎలా సముదాయించాలా అని కలవరపడుతున్నాడు అసలేం జరిగిందో తెలియని సుబ్బారావు. రాజ్యలక్ష్మి ధోరణిచూచి బయటికి గెంటిస్తుందేమోనని దొంగలా బయటికి జారుకోబోయాడు రామారావు

"ఆగండి." జ్యోతివంక ఆశ్చర్యంగా చూస్తున్నారంతా.

"నేను డాక్టరిగారతో పరీక్ష చేయించుకోవటానికి సిద్ధమే. నా కన్యాత్వాన్ని నేను రుజువు చేసుకుంటాను. మరి మీ మేనల్లుడి మాటేమిటి? అతన్నీ డాక్టరుకి చూపించాలికదా! సంసారానికి పనికొస్తాడోలేదో, అస్ఖలిత బ్రహ్మచారి అవునో కాదో.... అదేం?! మాట్లాడరేం? మగవాడికి అవన్నీ అఖ్ఖరేదా?!" అగ్ని కణికలా, వజ్రపు తునకలా వుంది జ్యోతి. నోరు విప్పి మాట్లాడమే అరుదైన కూతురింత ధైర్యంగా అడుగుతూంటే చేష్టలు దక్కి. చూస్తున్నాడు సుబ్బారావు. తాత్కాలికమైన ఆవేశం ఫలితమైతేనేం, తీవ్రమైన అవమానవేదనలోనుంచి అప్పటికప్పుడు పుట్టుకొచ్చిందైతేనేం, జ్యోతి సాహసం చూచి ముచ్చటగా వుంది రాజ్యలక్ష్మికి.

యీ ధైర్య సాహసాల ఫలితమేమిటో జ్యోతికి తెలుసు కాని....

"యీ దౌర్భాగ్యపు సమాజంలో హీనాతిహీనంగా బ్రతుకుతున్న ఆడపిల్లని, గత్యంతరం లేక యిప్పటివరకు మీ దుర్మార్గాన్ని సహించాను. కాని నేను మనిషిననే స్పృహ నాకింకా వుంది. నేను మనిషిగానే బ్రతుకుతాను" రాజ్యలక్ష్మికి చేతులు జోడించి వడివడిగా వెలుపలకు వచ్చిన జ్యోతి రక్తారుణరేఖలా వుంది. ✱


**MARK THE MPF HALLMARK TO PICK YOUR PENCILS**

Now with a superior range of

**SUJATHA**

**KAVERI**

**ANAND**

You can be perfectly sure of pencil-quality with the hallmark of MPF – makers of better pencils for over 60 years.




Madras Pencil Factory
15, Stringers Street, Madras 600 00

*MAKERS OF BETTER PENCILS*

ADWAVE/MPF/1618C